# 14. సాహిత్య సత్యభామలు

సీరియల్ నవల అనగానే మన ప్రఖ్యాత రచయిత్రీ మణులే గుర్తుకు వస్తున్నట్లు దీపావళి అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది సత్యభామ !

శ్రీ కృష్ణుడిని ముప్పుతిప్పలూ పెట్టి చివరికి తలదన్న గల స్టేటస్ సంపాదించుకున్న అలనాటి సత్యభామలాగే ఈనాటి మన సాహితీ రంగంలోని అపర సత్యభామలూ వారపత్రికల ద్వారా విజృంభించి మగ రచయితల్ని ఓ మూలకు నెట్టేసి తమ తమ కలాల విశ్వరూపాన్ని సహస్ర నవలా కిరణాల్తో ప్రసరింపజేసి పాఠక లోకం కళ్ళు జిగేల్మని, బుర్రలు దిమ్మ తిరిగి పోయేలా చేసేశారు.

ఈ నాటి పత్రికా ప్రపంచంలోని పెద్ద పీటలూ, సింహాసనాలూ అన్నీ సత్యభామలవే !

అలనాడు సత్యభామ యుద్ధంలో అలసిపోయి మూర్ఛ పోయిన శ్రీకృష్ణుడికి బాసటగా నరకాసురుడితో స్పెషల్ యుద్ధం చేసి వాడిని యమధర్మరాజుకు పెర్మనెంట్ గెస్ట్‌గా పంపేసింది.

నరకాసురుడు చీకటికి చిహ్నమనీ, వాడిని పైలోకా

నికి టపాకట్టించెయ్యటంతో ఆ చీకట్లు పటాపంచలై లోక మంతా నైట్ క్లబ్బుల వెలుగులో మెరిసిపోయే న్యూయార్కు నగరంలా వెలిగిపో నారంభించిందనీ, అందుకే సదరు నరకాసుర్రావు తద్దినం ఏటాటా జరుపుకుంటూ దానికి "దీపావళి" అని ఓ ముద్దుపేరు తగిలించుకున్నామనీ మన పండితులు పురాణం చదువుతుంటారు.

సాహిత్య రంగంలోని మన అపర సత్యభామలు చేస్తున్న లోకోద్ధరణ కూడా దాదాపు ఇలాంటిదే!

సాహిత్య శ్రీకృష్ణు లెల్లరూ తెల్ల కాగితాల్ని నలుపు చెయ్యటంలో అలసిపోయి దంచిందే దంచటం ఎలాగా అని దిక్కుతోచక చతికిల బడిన చారిత్రాత్మక క్షణాన్న మన సత్యభామలు కొంగులు బిగించి కలమె చలత్ ఖలీనముగ కదన రంగంలోకి దూకి విజృంభించారు.

పత్రికా ప్రభువులు కూడా ఈ నవనారీ సాహితీ యోద్ధల సహకారంతో పాఠక ప్రపంచాన్ని మైకంలో ముంచితేల్చి పత్రికా పాఠకుల, పాఠకురాండ్ర సంఖ్యను అమాంతంగా పెంచిపారేశారు.

తేడా ఏమంటే; అలనాటి సత్యభామ నరకాసురుడిని పులుసులోకి మిగలకుండా సఫాచేసేసి చీకట్లను పారద్రోలిందనుకుంటే. ఈ నాటి సాహితీ సత్యభామల్లో ఏ ఒకరిద్దరో తప్ప మిగిలిన భామలందరూ ఉన్న చీకటికి మరికాస్త

జోడించి, దానికి నగిషీలు చెక్కి షోకుచేసి పాఠక మహాశయులను స్లీపింగ్ పిల్స్‌తో పనిలేకుండానే చల్లగా జోకొట్టి నిద్రబుచ్చుతున్నారు. అసంఖ్యాకంగా చదువరులను తయారుజేసి, వారినిలా బుజ్జగించి బుద్ధావతారాలుగా చేయగలుగుతున్న వీరి ప్రజ్ఞకు నివాళు లెత్తవలసిందే!

ఈ నాటి మన సాహిత్య సత్యభామల్ని తిట్టుకోని మగ రచయితగానీ, క్రిటికేశ్వరుడుగానీ లేడు. ఈ అడనవలల్తో పత్రికలూ, లైబ్రరీ బీరువాలూ నిండిపోయి మురుగుకంపు కొడుతున్నాయని వీరంతా సదా వాపోతుంటారు. అవకాశం దొరికినప్పుడల్లా "ఆధునికాంధ్ర పత్రికా సాహిత్య వనములో రచయిత్రీమణుల దౌర్జన్య విహారము-ఒక ఖండన" అంటూ వ్యాసాలు కూడా రాసేస్తుంటారు.

నిజంగా ఇది నారీలోకానికీ, వారి లీడర్లయిన సత్యభామలకూ గర్వకారణమే. బహుశా వాళ్ళీ ఖండనలూ, ముండనలూ చదువుకుని కాళ్ళ దగ్గిర చతికిలబడి "కోపమేలనే భామా! సత్యభామా!" అని బ్రతిమాలుకునే టక్కరి కృష్ణుడిపాట్లు చూసి ముసిముసిగా నవ్వుకునే సత్యభామలా నవ్వుకుంటూంటారేమో!

మన సాహితీరంగం ఈ సత్యభామలకు ఎంతైనా రుణపడి ఉంది. సాహితీ కృష్ణులంతా ఆంగ్లసాహిత్యానికి తెలుగు వేషం వేసే మహాత్కార్యంలో అలసిపోయిన సమయాన అచ్చ తెలుగు బెంగాలీ నవలల్ని అందించి మన కాలక్షేపానికి లోటు

లేకుండా చేసిన ఘనత వీరికే దక్కవలసి ఉంది. ఒకప్పుడు మన లైబ్రరీల్లో రెండు బీరువాలుంటే అందులో ఒకటి సదా ఖాళీగా పడిఉండేది. సత్యభామల పుణ్యమా అని ఈనాడు ఒకటికి పదిబీర్వాలైనా చాలక, కార్పెంటర్లకు గిరాకీ పెరిగి పోయింది. ప్రెస్సుల వాళ్ళకు, బైండర్లకు, ఆర్టిస్టులకు, పబ్లిషర్లకు తీరిక లేకుండా పోయింది.

సినిమా వాళ్ళు కథలు దొరకటం లేదని కలకత్తాకూ, కోయంబత్తూరుకూ, కంచికి పరుగెత్తుతూంటారు గానీ వాళ్ళు మన సత్యభామల వద్ద నేర్చుకోవాల్సిందెంతేనా ఉంది. ఒకే కథను తిరగా బోర్లావేసి రకరకాల రుచుల్తో క్రొత్త క్రొత్తగా వండటంలో సత్యభామలది అందె వేసిన చేయి అని క్రిటికేశ్వరులు సెలవిస్తుంటారు గదా? మరి మన సినిమాల వాళ్ళకు కావాల్సింది కూడా సాక్షాత్తూ అలాంటి మేధావి సత్యభామలే అయి ఉండగా అటూఇటూ కథ కోసమని పరుగెత్తనేల! పైగా ఈ మధ్య సిన్మాలుగా వచ్చిన చెల్లూ సత్యభామల నవలా సిన్మాలన్నీ సక్సెస్సయ్యాయి గదా!

పాఠకుల నాడిని సత్యభామలు గ్రహించినంతగా మరెవరూ అర్ధం చేసుకుని క్యాషు చేసుకోలేదేమో! గిట్టని వాళ్లు అంటూంటారు గదా. "ఈ సత్యభామలు రాసేదంతా వంటింటి సాహిత్యం. ఆడంగులు వంటింట్లో పొయ్యి ముందు కూర్చుని తీరిగ్గా చదువుకునే బాపతు బీరకాయ పీచు సాహిత్యం" అని. ఎంతనేతి బీరకాయలోనయినా కనీసం పీచు అయినా ఉంటుంది గదండీ! ఆ పీచు మీదే పాఠకులు మోజు ఎందుకు చూపు

తున్నారని ఎవరూ అడగరేం! మగవాళ్ళ నవలల్లో ఆ మాత్రం పిచు కూడా లేదనా దీని తాత్పర్యం!

పోనీ, కనీసం ఆడంగుల చేత కూడా చదివించలేని సాహిత్యం తమది అని చెప్పుకోడానికేనా మన సాహిత్య శ్రీ కృష్ణుల కుండాలి గదా అభిమానం! అలాంటపుడు ఈ పిచు సాహిత్యానికి బదులు తమ గుజ్జు, సాహిత్యాన్ని ఈ అమాయక పాఠకుల చేత చదివించ గలిగేందుకు మన సాహితీ కృష్ణులంతా ఏం చేస్తున్నట్లు! సత్యభామల దౌర్జన్యాల్ని గురించి తిట్టుకుంటూ. వాపోతూ కూర్చోవడమేనా!

"నాది పిచు సాహిత్యం అయితే అవుగాక! నా పిచు నవలల్నే నా పాఠకులు పిచు మిఠాయిలా ఆప్యాయంగా తింటున్నపుడు ఏ క్రిటికుడు ఏమని ఏడిస్తే నాకేం! చేతనయితే ఈ సాహితీ కృష్ణులూ క్రిటిక దుశ్శాసనులూ తమ పిచున్నర నవలల్ని తొక్కుడు లడ్డూల్లా పాఠకుల చేత మింగించేందుకు ప్రయత్నించ గూడదా! వాళ్లా పని చేయ గలిగితే నేనూ తొక్కుడు లడ్డూల్నే వండి వడ్డిద్దును గదా" అని సవాల్ చేసిందా మధ్య ఓ సత్యభామ!

నిజమే! సినిమాల వాళ్ళు అంటూంటారు. "మమ్మల్నేం చెయ్య మన్నారయ్యా స్వామీ! ఆ లంగాలేని డాన్సులూ, మూతి విరిగి ముక్కు బద్దలయ్యే ఫైటింగులూ ఉంటేనే మీరంతా చూస్తున్నారు గనుక మేం తీస్తున్నాం!" అని.

ఇది అక్షర లక్షలు చేసేమాట! చెత్త అంటే ఏమిటో బాగా గ్రహించాక ఆ చెత్తను ఇహ తినలేని స్థితికి వచ్చాక గానీ ఏ అమాయకుడూ చెత్తను కాశీలో వదిలేసి చెత్త సన్యాసం పుచ్చుకోడు. అడపా దడపా అలా జరుగుతూండ బట్టే ఒక వెలుగు వెలిగిన గొప్ప సినిమావాళ్లు చాలా మంది రెండో సారి కూడా వెలగపోయి ఆరిపోవటం.

అందుకని దమ్ముగల మన సాహితీ కృష్ణు లెవరేనా పూనుకుని సత్యభామా సాహిత్యంలోని నిట్టూర్పులు, ఎగ ఊపిర్లు, కన్నీళ్ల ప్రవాహాలు, హృదయం వేగటాలు, దీనంగా చూడటాలు ఇత్యాదులు పాఠకులకు భరించ రానివిగా తోచగల నవ సాహిత్యాన్ని వండి వడ్డిస్తే గానీ ఈ పరిస్థితి మారదు.

ఆ మాత్రం మార్చగల సత్తాలేని శ్రీకృష్ణులు సత్యభామల్ని తిట్టుకుంటూ కూర్చోటం ఏమంత మర్యాదస్తుల పనిగాదు

నల పాకాలకూ, భీమ పాకాలకూ సుప్రసిద్ధమయిన మన పుణ్యభూమిలో ఆ మాత్రం వంటచేసి పాఠకుల చేత తినిపించగల వాళ్లు తప్పకుండా ఉంటారు. వాళ్ళీ సవాలందుకుంటారేమో చూద్దాం.

ఈ పుణ్యభూమిలో ఏదీ అసంభవం కాదు, గదా మరి.

(నవంబర్ 1972)